
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 31 । ఆగస్టు । 2023



సోమశిలలో 17.368 టీఎంసీలు

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 17.368 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 221 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.61,120
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,489
3శాతం జీఎస్టీతో	రూ.5,654
నవర (8గ్రా)	రూ.45,232

గరిష్టం/కనిష్టం
37.5 /25.4

వాతావరణం

వాతావరణంలో తేమ 100 శాతం ఉంది. జిల్లాలో గురువారం అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

బాలిక ఆపరేషన్‌కు రూ.17.50 లక్షల సాయం



సీఎం సహాయనిధి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): కావలి నియోజకవర్గం దగదర్తికి చెందిన యామాల రక్షితకు లివర్ ఆపరేషన్ కోసం సీఎం వైఎస్ జగన్ తన సహాయ నిధి నుంచి రూ.17.50 లక్షలు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాన్ని రక్షిత తల్లి శివరామమ్మకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన నివాసంలో బుధవారం అందజేశారు. దగదర్తికి చెందిన యామాల శివరామమ్మ కుమార్తె రక్షిత లివర్ సమస్యతో బాధపడుతోంది. ఇప్పటికే ఆమె వైద్యం కోసం చాలా ఖర్చు చేసిన కుటుంబ సభ్యులు ఇంకా భరించే స్థోమత లేక ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. స్పందించిన ఆయన సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లగా బాలిక లివర్ ఆపరేషన్‌కు సీఎం సహాయనిధి నుంచి రూ.17.50 లక్షలు విడుదల చేశారు. దీంతో పాప ప్రాణాన్ని కాపాడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని తల్లిదండ్రులు పేర్కొన్నారు. సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆర్థిక సాయం మంజూరు చేయించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్

నెల్లూరు సిటీ: నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను కార్పొరేషన్‌ను డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ బుధవారం ప్రారంభించారు. నగర ఎమ్మెల్యే పీ అనిల్ కుమార్ ఆదేశాల మేరకు పేదలకు రుచికరమైన ఇంటి ఆహారాన్ని సరసమైన తక్కువ ధరకు అందించేందుకు ఆహా క్యాంటీన్‌ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. మెప్మా ఇన్‌చార్జి శివాచారి, కార్పొరేటర్ ఎస్కే కరీముల్లా, వేలూరు మహేష్, ఎస్కే అస్మా జయలక్ష్మి, ఎస్‌కే సిద్దిక్, మాణిక్యాల సునీల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి తప్పిన విద్యార్థులకు అవకాశం

నెల్లూరు (టౌన్): గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో తప్పిన విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షలు రాసేందుకు రాష్ట్ర విద్యాశాఖ అవకాశం కల్పించిందని ఇన్‌చార్జి డీఈఓ నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 15వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని చెప్పారు. మూడు సబ్జెక్టులకు రూ.110, ఆ పైన సబ్జెక్ట్‌లకు రూ.125 ఫీజు ఉంటుందన్నారు. పదోతరగతి తప్పిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేలా సంబంధిత ఎంఈఓలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు బాధ్యత తీసుకోవాలన్నారు.

డిసెంబరు 3న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

నెల్లూరు (టౌన్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షను ఈ ఏడాది డిసెంబరు 3న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఈఓ నారాయణరావు బుధవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు కలిగిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ఓసీ, బీసీలు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాలని చెప్పారు. అర్హులైన వారు వచ్చే నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు వీఎస్‌యూకు న్యాక్ బృందం రాక

వెంకటాచలం: కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి వర్సిటీ(వీఎస్‌యూ)కు జాతీయ అంచనా, అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) బృందం గురువారం రానుంది. 2 ఎఫ్, 12బీ గుర్తింపు పొందిన వీఎస్‌యూ యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఏడాది మార్చిలో న్యాక్ గుర్తింపు కోసం వివరాలను సమర్పించింది. అందులో భాగంగా న్యాక్ బృందం మూడ్రోజుల పాటు వర్సిటీని పరిశీలించనుంది.

సెలవుపై వెళ్లిన డీఈఓ

నెల్లూరు (టౌన్): జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవాని వచ్చే నెల 6వ తేదీ వరకు మెడికల్ లీవ్‌పై వెళ్లారు. అప్పటి వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ నారాయణరావుకు ఇన్‌చార్జి డీఈఓగా వ్యవహరించనున్నారు.

కారవ్యాన్ టూరిజం

పర్యాటక కేంద్రాలు, విహార యాత్రలకు వెళ్లే సమయంలో వసతి సౌకర్యాలు.. హోమ్లీ ఫుడ్.. కుటుంబంతో ఏకాంతంగా గడిపే విషయాల్లో పర్యాటకులు, యాత్రికుల్లో ఎన్నో అనుమానాలు తలెత్తడం సర్వసాధారణం. ఇప్పుడా సమస్య లేకుండా నచ్చిన చోటుకు వెళ్లి మనకి నచ్చిన విధంగా ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక ఆకర్షణగా కారవ్యాన్ టూరిజాన్ని జిల్లాకు తీసుకొచ్చేందుకు అడుగులు వేస్తోంది. ఇందుకోసం జిల్లాలోని పలు పర్యాటక కేంద్రాలను గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో కొత్త పర్యాటకాన్ని పరిచయం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.



- జిల్లాలో ఏర్పాటుకు పర్యాటక శాఖ ప్రణాళికలు
- 44 పర్యాటక ప్రాంతాల గుర్తింపు
- పిక్నిక్ సీజన్ల ప్రారంభానికి సన్నాహాలు
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం సన్నద్ధం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాకు పర్యాటకంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లాలోని పలు ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది పర్యాటకులకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించేందుకు పర్యాటక శాఖ రంగం సిద్ధం చేస్తోంది. అందుకోసం జిల్లాలోని 44 ప్రాంతాలను పర్యాటక బృందం పరిశీలించింది. వాటిని సమగ్రంగా అధ్యయనం చేసి పర్యాటక శాఖ రీజనల్ కోఆర్డినేటర్ రమణ ప్రసాద్ సారథ్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.



సంగం బ్యారేజ్

జిల్లాలో 44 పర్యాటక కేంద్రాల గుర్తింపు

జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 44 పర్యాటక కేంద్రాలను పర్యాటకశాఖ గుర్తించింది. తొలి విడతగా కండలేరు డ్యామ్, ఉదయగిరి దుర్గం, నెల్లూరులోని స్వర్ణాల చెరువు, రామాయపట్నం, తుమ్మలపెంట, మైపాడు, కొత్తకోడూరు, రామతీర్థం బీచ్‌ల్లో కారవ్యాన్ టూరిజం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది.

కుటుంబ సమేతంగా సెలవు దినాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించాలనుకునే వారికి ఈ టూరిజం ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. పెద్ద కుటుంబాలకు పెద్ద గదులు కలిగిన కారవ్యాన్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ తరహా విహార యాత్రలు ఢిల్లీ, కేరళ, తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే ఏర్పాటై ఉన్నాయి. జిల్లాలోనూ ఇలాంటి వసతులతో కూడిన కారవ్యాన్‌ల ఏర్పాటుకు పర్యాటక శాఖ సన్నద్ధమవుతోంది. సాధారణంగా చలనచిత్ర నటులు ఈ తరహా వాహనాలను షూటింగ్ విరామ సమయంలో వాడుతున్న విషయం తెలిసిందే. అలాంటి సౌకర్యాన్ని సాధారణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను వీక్షించేందుకు పర్యాటక శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది.

సాహస యాత్రల కోసం..

ఉదయగిరి దుర్గం, సిద్దలయ్యకోన, పెంచలకోన, తదితర ప్రాంతాల్లో రాత్రి విడిదితో పాటు అటవీ ప్రాంత సందర్శన, ట్రెక్కింగ్, తదితర అంశాలతో

మండలం	పర్యాటక కేంద్రాల సంఖ్య
ఉలవపాడు	12
గూడూరు	01
కావలి	08
బోగోలు	02
అల్లూరు	01
విడవలూరు	08
ఇందుకూరుపేట	07
టీపీగూడూరు	03
ముత్తుకూరు	02
మొత్తం	44

పర్యాటక యాత్రలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో జాతీయ రహదారులు విస్తరించడంతో ఉదయగిరి, రాపూరు అటవీప్రాంతాలతో పాటు రామాయపట్నం, మైపాడు బీచ్‌ల్లో కారవ్యాన్ వాహనాలతో కూడిన కొత్తరకం అనుభవంతో కూడిన పర్యాటకం రానున్న రోజుల్లో అందుబాటులోకి రానుంది.

సౌకర్యాలు ఇవీ..

కారవ్యాన్‌లో లగ్జరీ హోమ్స్ మాదిరిగా లాంజ్ కమ్ బెడ్‌రూమ్, కిచెన్, రెస్ట్‌రూమ్‌లు ఉంటాయి. క్వీన్ లేదా కింగ్ సైజ్ బెడ్, మైక్రోవేవ్, ఎలక్ట్రికల్ కెటిల్, రోస్టర్, ఇండక్షన్ స్టౌ, మినీఫ్రిజ్, షవర్‌తో కూడిన అత్యాధునిక టాయిలెట్లు అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు స్మార్ట్ టీవీ, బ్లూటూత్ మ్యూజిక్ సిస్టం, సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. వివిధ సైజుల్లో కారవ్యాన్‌లను అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటక శాఖ కసరత్తు చేస్తోంది.

కన్సల్టెన్సీ ద్వారా...

ప్రభుత్వం కారవ్యాన్ టూరిజాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన కన్సల్టెన్సీ సంస్థ ద్వారా ఏర్పాటు చేస్తోంది. ఎంపిక చేసిన పర్యాటక ప్రాంతాల్లో డిమాండ్ ఆధారంగా వీటిని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. కారవ్యాన్ టూరిజంలో పెట్టుబడులకు ప్రైవేట్ సంస్థలు సైతం ఆసక్తి చూపుతున్నాయి. లగ్జరీ కంపెనీల వాహనాలే కాకుండా సాధారణ వాహనాలను లగ్జరీగా డిజైన్ చేయనున్నారు. ఇందుకోసం రవాణా శాఖతో కూడా సంప్రదింపులు చేస్తున్నారు.

జిల్లాలో సన్నాహాలు



టూరిజం కారవ్యాన్‌కు విశేష ప్రాచుర్యం లభిస్తున్న నేపథ్యంలో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని పర్యాటక ప్రాంతాలను గుర్తించాం. నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, కండలేరు, మైపాడు ప్రాంతాల్లో కారవ్యాన్‌ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రభుత్వ అనుమతులు రాగానే ముందుకెళ్తాం. ఒక్కో ప్రాంతంలో దాదాపు అరెకరం విస్తీర్ణంలో కారవ్యాన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ప్రకృతిని ఆస్వాదించేందుకు టెంట్‌లను కూడా అందజేస్తాం. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న కారవ్యాన్‌లకు ప్రత్యేక ప్యాకేజీలను నిర్ణయిస్తున్నాం.

– రమణ ప్రసాద్, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్, తిరుపతి

సీఎం జగన్ నిర్ణయాలు చరిత్రాత్మకం

- మండలాల్లో జెడ్పీటీసీలకు భవనాలు
- పాత జెడ్పీ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్
- జెడ్పీలో అతిథిగృహం నిర్మాణానికి చర్యలు
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్



జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, ఎంపీపీలు

నెల్లూరు(పొగతోట): ఏళ్ల తరబడి భూములు సాగు చేసుకుంటున్న రైతులకు యాజమాన్య హక్కులు కల్పించడం, చుక్కల భూములను శాశ్వతంగా పరిష్కరించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కలెక్టర్ ఎం హరినారాయణన్ అధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందించేందుకు అధికారులు సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు జిల్లాను అభివృద్ధి పథంలో ముందంజలో నిలిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. జెడ్పీటీసీలు ప్రస్తావించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీసుకున్న నిర్ణయాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ 46 మండలాల్లో జెడ్పీటీసీలకు ప్రత్యేక గది నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతేడాది మాదిరిగానే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. పాత జెడ్పీ కార్యాలయ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్, నూతన జెడ్పీ కార్యాలయ అవరణంలో అతిథిగృహం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు జెడ్పీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నిలపాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి నిబంధనలు తెలియజేసినా విద్యాశాఖ అధికారులు ఇంత వరకు స్పందించలేదన్నారు. నాడు–నేడు పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో 1.13 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 89.70 లక్షల పనిదినాలు కల్పించామని చెప్పారు. కూలీలందరికి పనులు కల్పించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం వచ్చే నెల నుంచి కొత్తగా 7369 పింఛన్లు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక గ్రూపు మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1009.53 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.393.72 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేశామని వివరించారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి వైఎస్సార్ ఆసరా, స్త్రీనిధి, సున్నా వడ్డీ రుణాలు, వైఎస్సార్ చేయూత, తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్‌కు విలువైన ఆస్తులు ఉన్నాయన్నారు. పాత జెడ్పీ కార్యాలయ అవరణలో కమర్షియల్ కాంప్లెక్స్‌తో పాటు సమావేశ మందిరం, కల్యాణ మండపం ప్లానింగ్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీకు చెందిన విలువైన స్థలాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు అడిగిన సమాచారాన్ని సకాలంలో అందజేసేలా హెచ్‌ఓడీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా ఉండే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయగిరి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి డయాలసిస్ యూనిట్ మంజూరైందని, త్వరలో యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం డ్వామా, డీఆర్డీఏ, పరిశ్రమలు, మత్స్యశాఖ, ఎస్సీ కార్పొరేషన్, ఐటీడీఏ, బీసీ కార్పొరేషన్, మైనార్టీ కార్పొరేషన్, దివ్యాంగుల శాఖ, అటవీ శాఖల అధికారులతో సమీక్షించారు. తొలుత సమావేశానికి హాజరైన మంత్రికి జెడ్పీ చైర్‌పర్సన్ రాఖీ కట్టారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ కూర్మనాథ్, జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి, తిరుపతి డీఆర్వో బీ కోదండరామిరెడ్డి, విజయడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

బిల్లులు మంజూరు చేయండి

మండలంలో పాఠశాల భవనాలు నిర్మించి సంవత్సరాలు గడుస్తోంది. ఇంత వరకు బిల్లులు చెల్లించలేదు. మండలాధికారులను అడిగితే ప్రతి పర్యాయం ఉన్నతాధికారులకు పంపించామని చెబుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి.

–సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ, మర్రిపాడు

డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయండి

ఉదయగిరి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉంది. కిడ్నీ బాధితులు అధికంగా ఉన్నారు. డయాలసిస్‌కు దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయగిరిలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. మైనార్టీ పాలిటెక్నిక్ కళాశాలను ఉదయగిరిలో ఏర్పాటు చేయాలి. –తాజుద్దీన్, జెడ్పీకోఆప్టెడ్ సభ్యుడు

ఈ సారైనా నిగ్గు తేల్చేనా?

- సమగ్ర శిక్షపై వరుసగా 'సాక్షి'లో కథనాలు
- అక్రమాలపై ఉన్నతాధికారుల విచారణ
- రేపూ విచారించనున్న సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్ష కార్యాలయంలోని అక్రమాలపై ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. విచారణాధికారిగా సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్యను నియమించారు. బుధవారం సాయంత్రం ఆయన సమగ్రశిక్షలోని పలు విభాగాల ఉద్యోలను పిలిచి అక్రమాలపై ఆరా తీశారు. సమగ్ర శిక్షలోని అక్రమాలపై ఈ ఏడాది మే 3న 'మేం ఇక్కడే ఉంటాం', ఈ నెల 25న 'అంతా మా ఇష్టం' శీర్షికలతో 'సాక్షి' కథనాలను ప్రచురించింది. ఈ విషయంపై సీరియస్ అయిన సమగ్రశిక్ష ఎస్‌పీడీ శ్రీనివాసులు డీఈఓ గంగాభవానిని విచారించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఆమె తూతూ మంత్రంగా విచారించి నివేదిక పంపడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్‌పీడీ శ్రీనివాసులు మళ్లీ విచారించి నివేదిక ఇవ్వాలని సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్యను ఆదేశించారు. ఆయన గత నెలలో నెల్లూరు వచ్చినా సెక్టోరియల్స్‌ను విచారించకుండా సమగ్రశిక్ష ఏపీసీ, డీఈఓలతో మాట్లాడి వెళ్లారు.

నిష్పక్షపాతంగా విచారణ జరిగేనా?

సమగ్రశిక్షలోని అవినీతి, అక్రమాలపై విచారణ నిష్పక్షపాతంగా జరిగేనా అనే అనుమానం అందరిలో కలుగుతోంది. బుధవారం సమగ్రశిక్షలో విచారణ చేపట్టిన సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య ఆ శాఖలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులను విచారించారు. ప్రత్యామ్నాయ హాస్టల్స్ (సీజనల్ హాస్టల్స్), కలెక్టర్ అనుమతి లేకుండా, సమగ్రశిక్ష ఉన్నతాధికారుల అనుమతి లేకుండా 12 వాహనాలను అద్దెకు తిప్పడం, ఐఈ వింగ్‌లో బిల్లుల సంతకాల్లోని అక్రమాలపైన సంబంధిత ఉద్యోగులను పిలిచి మాట్లాడినట్లు సమాచారం. గురువారం కూడా ఆయన విచారణ చేపట్టనున్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై క్రమశిక్షణా చర్యలకు వెనుకాడబోమని కలెక్టర్ ఎం హరినారాయణన్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి మండలాధికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం, గ్రామ వార్డు సచివాలయాలపై సమీక్షించారు. తొలుత జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సమీక్షిస్తూ అర్జీలు రీఓపెన్ కావడంపై అసహనం వ్యక్తం చేశారు. అర్జీలు రీఓపెన్ అవుతున్నాయంటే అధికారులు సరైన పరిష్కారం చూపడం లేదని అర్థమవుతోందన్నారు. అర్జీల పరిష్కారంపై ఎన్నిసార్లు హెచ్చరించినా రెవెన్యూ శాఖలో మార్పురావడం లేదన్నారు. ఏదైనా సమస్య తమ శాఖకు సంబంధించినది కాకపోతే వెంటనే జిల్లా అధికారులకు నివేదిస్తే ఆయా శాఖలకు పంపుతారని తెలిపారు. అర్జీల పరిష్కారంలో కాలయాపన చేయరాదన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు సచివాలయాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. ఆరేళ్లలోపు పిల్లలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌కు జనన ధ్రువీకరణపత్రాల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. చేయూత పథకం దరఖాస్తుల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సెప్టెంబరు 1న జిల్లాలో కొత్త పింఛన్లను లబ్ధిదారులకు స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో పండగ వాతావరణంలో అందజేయాలన్నారు. వలంటీర్ల ఖాళీలను నిబంధనల మేరకు భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ రోణంకి కూర్మనాథ్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీపీఓ సుస్మిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

'నా కోసం ఎవరూ వెతకొద్దు'

- డైరీలో రాసి బ్యాంక్ ఉద్యోగి అదృశ్యం


మధు (ఫైల్)

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అంబటి మధు (32) కనిపించడం లేదని ఆయన భార్య నాగమణి మర్రిపాడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పామూరు సమీపంలోని కంబాలదిన్నె గ్రామానికి చెందిన మధుకు వింజమూరు మండలం చాకలికొండకు చెందిన నాగమణితో ఐదు సంవత్సరాల క్రితం వివాహమైంది. గతంలో అద్దంకి ఏపీజీబీ శాఖలో పనిచేస్తూ మూడునెలల క్రితం మర్రిపాడుకు బదిలీపై వచ్చాడు. భార్యాబిడ్డలతో కలిసి మర్రిపాడులోనే నివాసముంటూ విధులు నిర్వహిస్తున్నాడు. అయితే తరచూ తన భార్యతో జీవితమంటే ఇంతేనా అంటూ మాట్లాడుతూ ఉండేవాడు. అలాగే పర్సనల్ డైరీలో తన కోసం ఎవరూ వెతకొద్దని, చనిపోవడానికి వెళ్లడం లేదని రాసి పెట్టాడని పోలీసులు తెలిపారు. డైరీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి వెల్లడించారు.

అన్నదానసత్రం నిర్మాణానికి శంకుస్థాపన


భూమిపూజ చేస్తున్న నాయకులు

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం గ్రామంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయ ఆవరణలో అన్నదానసత్రం, దుకాణాల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. దుకాణాలను దేవస్థాన నిధులతో, అన్నదానసత్రాన్ని మైపాడు వాసులైన బొద్దుకూరు శ్రీనివాసులు, ప్రసన్న దంపతులకు చెందిన రూ.70 లక్షల నుంచి రూ.90 లక్షల నిధులతో నిర్మిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బండి శాంతయ్య తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, కొండూరు కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, పంబాల జనార్దనరెడ్డి పాల్గొన్నారు.


చిన్నారి తడవకుండా..


నెల్లూరులో కురుస్తున్న వర్షం


గాంధీబొమ్మ సెంటర్‌లో..



అంతలోనే జోరువాన

నెల్లూరు నగరంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా జోరువాన కురిసింది. మధ్యాహ్నం వరకు ఉష్ణోగ్రత అధికంగా ఉంది. ఆ తర్వాత ఆకాశం మేఘావృతమై వాన పడింది. దీంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు చేరింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

రైతులకు భూ హక్కులు

- అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సాగుభూమికి పట్టాలు
- జిల్లాలో 4,017 మంది గుర్తింపు
- 4,313.57 ఎకరాల పంపిణీకి చర్యలు


అసైన్‌మెంట్ భూమి

నెల్లూరు(దర్గామిట్ట): సుదీర్ఘకాలంగా ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్న హక్కులు లేని రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూమిలో పంటలు సాగు చేస్తున్న రైతులను గుర్తించి వారికి డీ పట్టాలు అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆర్థికంగా అన్నదాతలు పైచేయి సాధించేలా అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఇప్పటికే అర్హుల జాబితాను సిద్ధం చేసింది.

నియోజకవర్గం పేరు	రైతుల సంఖ్య	భూమి విస్తీర్ణం (ఎకరాలు)
కందుకూరు	24	19.63
కావలి	171	147.02
ఆత్మకూరు	385	462.52
కోవూరు	107	89.32
సర్వేపల్లి	3,139	3,379.66
వెంకటగిరి (మూడు మండలాలు)	191	215.42
మొత్తం	4,017	4,313.57

ప్రభుత్వ భూమి గుర్తింపు

జిల్లాలో 4,017 మంది రైతులు 4,313.57 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వారి పూర్తి వివరాలను పరిశీలించి సదరు భూమికి పట్టాలు అందజేసేందుకు తొలిసారి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన అసైన్డ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మంత్రి సూచనలతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి ప్రభుత్వ భూమి సాగు చేస్తున్న వారి జాబితా రూపొందించారు. గత జూన్‌లో తొలి విడతగా గుర్తించిన అధికారులు అసైన్‌మెంట్ కమిటీ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. రెండో విడతగా మళ్లీ కొందరు రైతులను గుర్తించారు. ఆమోదముద్ర పడగానే పేదలకు 1.5 నుంచి 2 ఎకరాల వరకు డీ ఫారం పట్టాలు అందించనున్నారు.

ఇవీ అర్హతలు

సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి మినహా రైతులకు ఇతర పట్టా భూమి ఉండకూడదు. సాగు చేసుకుంటున్న భూమిపై ఇతరులకు డీ ఫారం పట్టా ఇచ్చి ఉండకూడదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో జరిగే అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదం పొందాలి.

పారదర్శకంగా అర్హుల ఎంపిక



ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న రైతులను గుర్తించాం. అర్హుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాం. వివరాలను అసైన్డ్ కమిటీ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదించాం. అవకతవకలకు తావులేకుండా నిరుపేదలైన అర్హులకు అందజేస్తాం. జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేదలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రభుత్వ ఆమోదం పొందగానే డీ ఫారం పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటాం. తొలి, రెండో విడతలో అర్హులకు అందించేలా చర్యలు చేపడతాం.
– రోణంకి కూర్మనాథ్, జేసీ

వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయం


రవీంద్రకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: 'వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోవడం ఖాయం. ఆ పార్టీ పూర్తిగా కనుమరుగవుతుంది.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. విడవలూరు మండలంలోని తీర ప్రాంతమైన కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ నెల్లూరు పార్లమెంట్ మత్స్యకార విభాగం ఉపాధ్యక్షుడు ఆవుల రవీంద్ర వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలోని పంచేడు గ్రామంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశానికి చెందిన కరుడుగట్టిన నాయకులు, కార్యకర్తలు సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగుందని వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని తెలిపారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీకి కేవలం 23 ఎమ్మెల్యే స్థానాలు వచ్చాయని, వచ్చే ఎన్నికల్లో అన్ని సీట్లు కూడా రావన్నారు.

99 వేల ఇళ్ల పూర్తి

గడప గడపకు మన కార్యక్రమానికి సంబంధించి కోవూరు నియోజకవర్గంలో 84 సచివాలయాల పరిధిలో సుమారు 99 వేల ఇళ్లను పూర్తి చేశామని ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. గతేడాది ఆగస్ట్ ఒకటో తేదీన ప్రారంభమైన కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అధికారుల సహకారం మరువలేనిదన్నారు. 99 వేల ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా 99 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, జెడ్పీటీసీ సూరా ప్రదీప, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, నాయకులు పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, సుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మోర్ల మురళి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వివరాలు సేకరిస్తున్న పోలీస్ సిబ్బంది

వరికుంటపాడు: జీవాల మేత కోసం వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన మండలంలోని అశోక్‌నగర్ సమీపంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరగలదిన్నె గడ్డకు చెందిన గజ్జల పెదవెంగయ్య (52) జీవాలను మేపుతుంటాడు. రోజులాగే మేత తెచ్చేందుకు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం వేంపాడు పంచాయతీ అశోక్‌నగర్ గ్రామ శివారుకు వెళ్లాడు. చెట్టు మండలు కొడుతుండగా దగ్గరలో ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై విజయ్ శ్రీనివాస్ తన సిబ్బందితో వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పెదవెంగయ్యకు భార్య ఉంది. ఘటనా స్థలాన్ని ఉదయగిరి సీఐ గిరిబాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సముద్రంలో బాలిక మృతదేహం


బాలిక మృతదేహం

బిట్రగుంట: బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతానికి సమీపంలో సుమారు పదేళ్ల వయసున్న బాలిక మృతదేహం బుధవారం కనిపించింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సముద్రంలో వేటకు వెళ్లి వస్తున్న స్థానిక మత్స్యకారులు ఫిషింగ్ హార్బర్ చేరువకు వచ్చేసరికి సముద్రంలో తేలుతున్న బాలిక మృతదేహాన్ని చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలిక ఎరుపు రంగు టీషర్ట్ ధరించి ఉండడం మినహా గుర్తింపునకు సంబంధించి ఎటువంటి ఆనవాళ్లు లేకపోవడంతో జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాల పోలీస్ స్టేషన్లకు, మెరైన్ స్టేషన్లకు సమాచారం అందించారు. మృతదేహంపై గాయాలు, చేపలు కొరికిన ఆనవాళ్లు లేవు. శరీరం ఉబ్బినట్టుగా కూడా లేకపోవడంతో మంగళవారం రాత్రి లేదా బుధవారం వేకువజామున సముద్రంలో పడినట్టుగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. బాలిక వివరాల కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

ఉదయగిరి: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సెబ్ ఎస్సై మురళీకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీతారామపురం మండలం పడమటివీధిలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో కావలి సెబ్ సీఐ శ్రీనివాసులు, ఎస్సై బాలకృష్ణ తమ బృందంతో కలిసి మంగళవారం రాత్రి దాడులు చేశారు. చందాల కాశయ్య, రోశమ్మను అదుపులోకి తీసుకుని వారి నుంచి 1.3 కేజీల గంజాయి ఆకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి ఉదయగిరి కోర్టులో హాజరుపరిచినట్లు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జలదంకి: మండలంలోని కోదండరామాపురం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. జలదంకి ఎస్సై పి.ఆదిలక్ష్మి కథనం మేరకు.. లక్కు బాలకృష్ణ కలిగిరి మండలం లక్ష్మీపురం వాసి. అతను కాకుటూరు నుంచి స్వగ్రామానికి కారులో బయలుదేరాడు. కాగా కోడూరు సుబ్బారెడ్డి మండలంలోని కోదండరామాపురం వాసి. ఈయన తన కుమార్తె వివాహానికి సంబంధించిన పనుల నిమిత్తం స్వగ్రామం నుంచి అయ్యప్పరెడ్డిపాళేనికి మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో కోదండరామాపురం సమీపంలో కారు సుబ్బారెడ్డి బైక్‌ను ఎదురుగా వచ్చి ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు చెన్నైకు తీసుకెళ్లారు. బాలకృష్ణ మద్యం తాగి కారు నడిపినట్లు పోలీసులు చెబుతున్నారు. ఎస్సై ఆదిలక్ష్మి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.35
పండు	: రూ.9

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 143
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 270
లేయర్ చికెన్	: 178